నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | వరంగల్, శుక్రవారం 14 మార్చి 2025 | MAHABUBABAD



శాసనమండలిలో గురువారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మహబూబాబాద్, ములుగు జిల్లాల అధ్యక్షులు మాలోత్ కవిత, కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు



పోచమ్మమైదాన్ సెంటర్‌లో ఎమ్మెల్సీ కవిత చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

## కేక్ కట్ చేసి.. పండ్లు పంపిణీ చేసి..

**ఘనంగా ఎమ్మెల్సీ కవిత పుట్టిన రోజు వేడుకలు**

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజు వేడుకలను గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాగృతి, బీఆర్ఎస్ కార్యకర్తలు కేక్ కట్‌చేసి, పటాకులు పేల్చి, పండ్లు, స్వీట్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పలుచోట్ల కవిత చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.

– నమస్తే నెట్‌వర్క్, మార్చి 13

## వాగులో బావి తవ్వుతూ..

**సాగు నీటి కోసం సాహసం**



ఆకేరు వాగులో ప్రొక్లెయిన్‌తో బావి తీయిస్తున్న రైతు అంగోత్ రామ

డోర్నకల్, మార్చి 13: మహబూబాబాద్ జిల్లా అందనాలపాడు గ్రామానికి చెందిన రైతు అంగోత్ రామ సాగు నీటి కోసం సాహసం చేస్తున్నాడు. ఏకంగా ఆకేరు వాగులో బావి తవ్వుతూ పంటను కాపాడుకోవడానికి తాపత్రయ పడుతున్నాడు. యాసంగిలో పదెకరాల పొలంలో వరి పంటను సాగు చేయగా, చేతికొచ్చే సమయంలో సాగు నీళ్లు రాక ఎండిపోతున్నది. పంట సాగు కోసం రూ. లక్షల్లో పెట్టుబడి పెట్టానని వాపోతున్నాడు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో ఏ రోజు యాసంగి సాగు వరి పంట ఎండిపోలేదని చెబుతున్నాడు. ఇన్ని రోజులు ఎస్సారెస్పీ జలాల కోసం ఎదురుచూశానని, అవి రాకపోవడంతో ప్రొక్లెయిన్‌తో ఆకేరు వాగులో బావి తీయించానని చెప్పుకొచ్చాడు. ప్రభుత్వం, పాలకులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సాగు నీళ్లు లేక వేలాది ఎకరాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

నెల్లికుదురు : బ్రాహ్మణకొత్తపల్లి శివారులోని ఆకేరు వాగులో జేసీబీ సాయంతో గుంత తవ్విస్తున్న రైతులు





తూర్పుతండాలో బావిలో నీరులేక బోర్లు వేస్తున్న రైతు గుగులోత్ రాంధాన్

## నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు లేదు

**తూర్పు తండాలో ఒక్కొక్కటి వెయ్యి ఫీట్ల లోతు**

దంతాలపల్లి, మార్చి 13 : మండలంలోని పాలేరు వాగులో చెక్ డ్యాంలు ఎండిపోతున్నాయి. యాసంగి తొలి దశలో చెరువులు, కుంటలు, వాగులు కళకళలాడి బోర్లు, బావుల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో రైతులు వరి, మక్కజొన్న, మిర్చి, పత్తి పంటలు సాగు చేశారు. గత ప్రభుత్వం అందించిన మాదిరిగానే ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తదనే ధీమాతో రైతు బంధు ఇవ్వకపోయినా కూడా అప్పులు చేసి పంటలు వేశారు. కాంగ్రెస్ సర్కారు ఎస్సారెస్పీ జాలాలతో పాలేరు వాగు, చెరువులు, కుంటలు నింపుక పోవడంతో బావులు, బోర్లు అడుగంటి రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. తూర్పుతండాకు చెందిన రైతు గుగులోత్ రాంధాన్ పంటలకు సాగునీరు లేక నాలుగు బోర్లు ఒక్కొక్కటి వెయ్యి ఫీట్ల లోతు వేసినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. కుమ్మరికుంట్లలో రైతు తండా రాములు బోరులో నీళ్లు ఎల్లక మూడెకరాల వరిలో పశువులు మేపుతున్నాడు. ఇలా ఈ గ్రామంలోనే కాదు ఎక్కడ చూసినా రైతులు సాగు నీటి కోసం అరిగోస పడుతున్నారు.

# చివరి తడికి భగీరథ యత్నం

మరిపెడ మండలం తండాధర్మారంలో వ్యవసాయ బావిలో నీరు అడుగంటడంతో సాగునీటి కోసం పూడిక తీయిస్తున్న ఓ కౌలు రైతు



- సాగు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్న రైతులు
- బోర్లు వేస్తూ.. వాగుల్లో పూడిక తీస్తూ..
- పంటలను కాపాడుకునేందుకు వ్యయప్రయాసలు
- ఎస్సారెస్పీ జలాలు వదలలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం
- సర్కారుపై దుమ్మెత్తి పోస్తున్న అన్నదాతలు

*చి'వరి' తడికి నీరందించేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. అందిన కాడికల్లా అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టి నోటికందే సమయానికి పొలాలు కండ్ల ముందే ఎండిపోతుండడంతో గుండెలు బాదుకుంటున్నారు. ఎలాగైనా పంటలను కాపాడుకోవాలని బోర్ల పక్కన బోర్లు వేస్తూ, వాగులు, కుంటల్లో పూడిక తీస్తూ సాగు నీటి కోసం తండ్లాడుతున్నారు. కొందరు రైతులు రూ. వేలు ఖర్చు చేసి జేసీబీతో వాగుల్లో గుంతలు తవ్వించి, మోటర్లు పెట్టి కొద్దోగొప్పో నీటిని తమ పొలాలకు పారిస్తున్నారు. యాసంగికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సారెస్పీ కాల్వలతో వాగులు, చెరువులు, కుంటలు నింపకపోవడంతో భూగర్భ జలాలు తగ్గి బావులు, బోర్లలో నీరు అడుగంటి అన్నదాతలు అరిగోస పడుతున్నారు. బావులు, బోర్లలో నీళ్లు ఎల్లక పంటలు ఎండిపోవడంతో కొందరు రైతులు పశువుల మేతకు వదిలేశారు. మరికొందరు చివరి తడి నీటి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ముందస్తుగా ఎస్సారెస్పీ జలాలు విడుదల చేయకనే తమ పంటలు ఎండిపోయాయని కాంగ్రెస్ సర్కారుపై అన్నదాతలు దుమ్మెత్తి పోస్తున్నారు.*

*- నమస్తే నెట్‌వర్క్, మార్చి 13*

## ముఖ్యమంత్రి ఏం చేస్తున్నడు?

సంగెం : నీళ్లులేక పంటలు ఎండిపోతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ఏంచేస్తున్నరు? మా కష్టం, శ్రమ చూడండి. దేవాదుల కాల్వల ద్వారా నీళ్లస్తయని పంటలు వేసినం. అవి రాక పంటలు ఎండిపోయినయ్. మా ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలే. రైతులను ఎవరు పట్టించుకుంటరు. కొత్త ప్రభుత్వం కాల్వలు శుభ్రం చేసి నీళ్లిస్తది కావచ్చు అనుకున్నం. ఎమ్మెల్యేలు, అధికారులకు పట్టింపు లేదా? కొద్దిగనైనా చర్యలు తీసుకోరా? కెనాల్‌లో మొలిచిన చెట్లను తొలగించెటోళ్లు లేరు. సాగునీరు లేక నా మక్కజొన్న పంట ఎండిపోతున్నది.

– సింగిరెడ్డి బుచ్చిరెడ్డి, రైతు, గవిచర్ల, సంగెం మండలం



ఎండిన మక్కజొన్న చేను వద్ద గవిచర్ల రైతు సింగిరెడ్డి బుచ్చిరెడ్డి



చిన్నగూడూరు మండలం విస్సంపల్లిలో నీరులేక ఎండుతున్న పొలంలో పశువులను మేపుతున్న రైతు శ్రీశైలం

## ఎండిన పొలాలను చూసి కన్నీరు

**ఎస్సారెస్పీ నీటి కోసం అల్లాడుతున్న విస్సంపెల్లి రైతులు**

చిన్నగూడూరు మార్చి13: సాగునీరు లేక ఎండిపోతున్న వరి పొలాలను చూసి రైతులు కంట తడి పెడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం విస్సంపల్లి గ్రామంలో తుమ్మల చెరువులో చుక్క నీరు లేకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి. గ్రామానికి చెందిన బొమ్మ శ్రీశైలం తనకున్న 10 ఎరాల్లో వరి పంట సాగు చేయగా, రెండెకరాలు పూర్తిగా ఎండిపో యాయి. ఎకరాకు రూ. 30 వేల చొప్పున పదెకరాలకు రూ.3 లక్షలు అప్పు తెచ్చానని వాపోయాడు. అదే గ్రామానికి చెందిన వడ్లకొండ నాగయ్య ఎకరంన్నర పొలం నీల్లులేక ఎండిపో యింది. తుమ్మల చెరువు కింద పంటసాగు చేస్తున్న బాలకృష్ణ, చిరంజీవి, అశోక్ తదితర రైతుల పంట లకు ఇదే పరిస్థితి ఉంది. మరిపెడ మండలం నుంచి విస్సంపల్లి గ్రామానికి ఎస్సారెస్పీ ఉపకాల్వ ఉన్నా ఎగువ గ్రామాల రైతులు చుక్క నీరు దిగువకు రాకుండా అడ్డుకట్ట వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు ఎండితున్నాయని స్థానిక ఎమ్మెల్యేకు సైతం తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులు చుట్టపుచూపుగా వచ్చి వెళ్లారని రైతులు మండిపడు తున్నారు. సంబందిత అధికారులు చొరవచూపి ఎస్సారెస్పీ కాల్వ ద్వారా తుమ్మల చెరువుకు నీరందిస్తే కొంత మేర పంటలను కాపాడుకోవచ్చంటున్నారు.

## పంటలు ఎండినంక నీళ్లిస్తరా?

- పురుగుల మందు డబ్బాలతో రైతుల ధర్నా
- వడ్లకొండ క్రాస్ వద్ద రోడ్డుపై బైఠాయింపు

జనగామ రూరల్, మార్చి13 : పంటలు ఎండినంక నీళ్లస్తరా?, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జనగామ మండలం గానుగుపహాడ్–వడ్లకొండ క్రాస్ రోడ్డు వద్ద పురుగుల మందు డబ్బాలతో రైతులు ధర్నా చేశారు. గానుగుపహాడ్, ఎర్రకుంట తండా, మరిగడి, వెంకిర్యాల, వడ్లకొండ తదితర గ్రామాల రైతులు జనగామ–హుస్నాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ బొమ్మకూర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు వస్తుండడంతో కిందకు విడుదల చేసి ఎండిపోయిన పంటలకు జీవం పోయాలన్నారు. చేతికి వచ్చే దశలో ఉన్న పంటలకు నీరు విడుదల చేస్తే కాపాడుకుంటామని, లేకుంటే చావే శరణ్యమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, అందుకే రోడ్డెక్కామని తెలిపారు. ఉన్న పంటను కాపాడుకుందామంటే వచ్చీరాని కరెంట్‌తో మొదటి దొయ్యనే పారుతున్నదన్నారు. ఇలాంటి కష్టం ఎవ్వరికీ రావొద్దన్నారు. పక్కనే రిజర్వాయర్ ఉండి, గ్రామాలకు గోదావరి కాల్వలు ఉన్నా మా గ్రామాలకు నీరు రావడం లేదంటే ఎవరి తప్పిదమో అర్థం కావడం లేదన్నారు. గత ప్రభుత్వంలో చెరువులు, కుంటలు నిండి మత్తళ్లు పోసేవని, కాల్వల ద్వారా నీటిని విడుదల చేస్తే వద్దని అధికారులకు చెప్పిన రోజులు ఉన్నాయని, నేడు నీళ్లు కావాలని రోడ్లపైకి వచ్చే రోజులు వచ్చాయని పేర్కొన్నారు. ధర్నా వద్దకు ఇరిగేషన్ డీఈ శ్రవణ్ వచ్చి మాట్లాడుతూ శనివారం వరకు నీటిని విడుదల చేస్తామ ని తెలిపారు. రైతు లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రెండు గంటలపాటు ధర్నా నిర్వహించడంతో కిలోమీటర్ మేర భారీగా ట్రాఫిక్ జాం కావడంతో పోలీసులు వచ్చి రైతులకు నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు రైతులు వినతిపత్రం అందజేసి తమ గోడును వెల్లబోసుకున్నారు. రిజర్వాయర్ లెవల్‌కు రాగానే నీటిని విడుదల చేస్తామని, రైతులు ఎవరూ ఇబ్బందులు పడకుండా అధికారులకు ఆదేశాలిస్తానని కలెక్టర్ తెలిపారు.



జనగామ–హుస్నాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

## సీఎంకు కమీషన్‌పై ఉన్న శ్రద్ధ రైతులపై లేదు

- పంటలు ఎండుతున్నా పట్టించుకోని ఎమ్మెల్యే కడియం
- కేసీఆర్ హయాంలో ఒక్క ఎకరం కూడా ఎండలే..
- స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య
- రఘునాథపల్లిలో ఎండిన పంటల పరిశీలన



ఎండిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

జఫర్‌గఢ్, మార్చి 13 : సీఎం రేవంత్‌రెడ్డికి 20 శాతం కమీషన్‌పై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టీ రాజయ్య అన్నారు. చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలు సాగునీరు లేక ఎండుతున్నాయన్నారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం రఘునాథపల్లిలో ఎండిన వరి, మక్కజొన్న పంటలు, దేవాదుల కెనాల్ దుస్థితిని గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. పంటలు ఎండిన రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. దేవాదుల కెనాల్‌లో నీళ్లు లేక గడ్డి పెరగడంతో గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనను రైతులతో కలిసి గుర్తు చేసుకున్నారు. రైతులతో కలిసి కెనాల్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో ఒక్క ఎకరం కూడా ఎండలేదన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఏడు రిజర్వాయర్‌లున్నా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పట్టింపులేని తనంవల్ల పంటలు ఎండుతున్నాయన్నారు. ఆయన రైతులను పట్టించుకోవడం మానేశాడని ఆరోపించారు. రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన రేవంత్‌రెడ్డి పాలనకు, గత పదేళ్ల కేసీఆర్ పాలనకు నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. రైతులను ఆదుకోని సీఎం రేవంత్‌రెడ్డి, సాగునీరు అందించలేని మంత్రులు, ఎమ్మెల్యేలు బహిరంగ సభల పేరుతో నియోజకవర్గానికి రావడం సిగ్గుచేటన్నారు. రైతులకు సాగునీరందించి, అన్ని వర్గాల ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాక స్టేషన్‌ఘన్‌పూర్ గడ్డపై అడుగు పెట్టాలన్నారు. ఈ నెల 16కు ముందే సాగునీరు విడుదల చేయాలని, లేకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని రాజయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మహేందర్‌రెడ్డి, మారపాక రవి, సోమిరెడ్డి, జయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు హోలీ..

**ఊరూవాడా రంగుల్లో తడిసి ముద్దయ్యేందుకు సిద్ధం**

నేడు హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఊరూవాడా రంగుల్లో మునిగి తేలనుంది. రంగు లు కొనేందుకు వచ్చిన కొనుగోలుదారులతో గురువారం ఉమ్మడి జిల్లావ్యా ప్తంగా మార్కెట్లు కిటకిటలాడాయి. సహజ సిద్ధమైన రంగులతో హోలీ జరుపుకునేందుకు చిన్నాపెద్దా సిద్ధమయ్యా రు. ఈ సందర్భంగా గురువారం రాత్రి పలు చోట్ల కామదహనం కార్యక్రమం నిర్వహించారు.



హనుమకొండలో రంగులు విక్రయిస్తున్న వ్యాపారి

## భర్త హత్యకు డీల్

- చంపేస్తే రూ.10 లక్షలిస్తానన్న భార్య.. హోలీలోపు పని పూర్తి చేయాలని ఒప్పందం
- ముఠా సభ్యుడి అత్యాశతో అసలు విషయం లీక్.. పోలీసులకు భర్త ఫిర్యాదు.. ఐదుగురి అరెస్టు

నర్సంపేట, మార్చి13: ఇటీవల వరంగల్‌లో యువ వైద్యుడు సుమంత్ రెడ్డిని సుపారి ఇచ్చి భార్య హత్య చేయించిన ఘటన మరువక ముందే నర్సంపేట మండలం ఆకులతండాలో మరో డీల్ వెలుగు చూసింది. రూ.10 లక్షలు ఇస్తానని, తన భర్తను చంపేయాలని ఒప్పందం కుదుర్చుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ధరావత్ సుమన్‌కు ఇదే మండలం మహేశ్వరం తండాకు చెందిన భూక్యా మంజులతో 2018లో వివాహం జరిగింది. వీరి ఒక పాప కూడా ఉంది. సుమన్ హైదరాబాద్‌లోని ఓ బ్యాంక్‌లో పీవోగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మూడేళ్లుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నా యి. ఈక్రమంలో పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. ఇదే అక్క సు పెంచుకున్న భార్య ఎలాగైనా భర్త సుమన్‌ను వదిలించుకోవాలని చూసింది. మంజుల బావ, సమీప బంధువైన మహేశ్వరం గ్రామానికి చెందిన మోతీలాల్ సహాయంతో ముఠా సభ్యులను కలిసి సుపారీకి ఆఫర్ చేసింది. రాయపర్తి మండలానికి చెందిన బానోత్ నరేశ్, తొర్రూరు మండలానికి చెందిన మల్లేశ్, ఆకులతండాకు చెందిన మూడు గోపితో మంజుల తన భర్తను చంపేందుకు రూ.10 లక్షల డీల్ మాట్లాడుకుంది. హోలీ పండుగ తర్వాత సుమన్‌ను హత్య చేసేందుకు ప్లాన్ చేసుకున్నారు. ఇదిలా ఉండగా కొన్ని రోజుల కిందట సుమన్‌కు నరేశ్ ఫోన్ చేసి రూ.3 లక్షలు ఇస్తే నీకు అతి విలువైన సమాచారం ఇస్తానని చెప్పాడు. మొదట్లో ఆ విషయాన్ని అంతగా పట్టించుకోని సుమన్ రెండు రోజుల క్రితం స్థానిక పోలీ స్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు నరేశ్ ఫోన్‌ను ట్రాప్ చేసి విచారణ చేపట్టడంతో అసలు విషయం బయట ప డింది. మంజుల తన భర్త హత్య కోసం రూ.10 లక్షల డీల్ ఒప్పుకున్నట్లు విచారణలో తేలింది. ఇందులో భాగంగా ఒక్కొక్క ముఠా సభ్యుడికి రూ.30 వేల చొప్పున ముగ్గురికి అడ్వాన్స్ పేమెంట్ కూడా ముట్టజెప్పినట్లు దర్యాప్తులో వెల్లడయ్యింది. దీంతో మంజుల, మోతీలాల్, నరేశ్, మల్లేశ్, గోపిలను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

శ్రీరస్తు! శ్రీలక్ష్మీనర్సింహస్వామినే నమః : శుభమస్తు!!
శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానము
కొమ్మాలగుట్ట, మం॥ గీసుగొండ, జిల్లా: వరంగల్.



బ్రహ్మోత్సవ (జాతర)
ఆహ్వాన శుభపత్రిక
జిల్లా నలుమూలల నుండి విచ్చేయుచున్న అశేష భక్తజనావళికి మిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు
స్వాగతం–సుస్వాగతం..
బండ్లు తిరుగుట : ది: 14-03-2025 శుక్రవారం (జాతర)
శకటయానోత్సవము
రథోత్సవము : ది: 18-03-2025 మంగళవారం రాత్రి 10గం.లకు
ఉగాది : ది: 30-03-2025 ఆదివారం రోజున పంచాంగశ్రవణం
లక్ష్మీప్రియ మిని ఫంక్షన్ హాల్
కాండూరి రామాచార్యులు
దేవస్థాన ప్రధాన అర్చకులు